

నైపుణ్యమస్తు..
విద్యార్థుల నైపుణ్యంలో శిక్షణ కోసం ఐటీఐ కళాశాల్లో అడ్మిషన్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది - 8లో



నేడు కాణిపాకంలో విశేష సేవలు
కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం విశేష సేవలు నిర్వహించనున్నారు. - 8లో



స్కూల్ బస్.. 'ఫిట్‌నెస్'
జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల బస్సుల కండిషన్ తనిఖీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

228 మంది ఉద్యోగులకు నోటీసులు



షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల విధులకు గైర్హాజరైన 228 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ వెల్లడించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన నిర్వహించిన పోలింగ్‌కు పీఓ, ఏపీఓ, ఓపీఓ విధులకు పలు శాఖల ఉద్యోగులను నియమించామన్నారు. అయితే బాధ్యతలేకుండా 228 మంది విధులకు హాజరుకాలేదని, వారికి నిబంధనల మేరకు నోటీసులు జారీ చేశామని వివరించారు.

23 నుంచి విత్తనాల పంపిణీ

చిత్తూరు అగ్రికల్చర్: ఈ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వేరుశనగ విత్తన కాయలను ఈ నెల 23వ తేదీనుంచి రాయితీపై రైతులకు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. జిల్లాలో ఈ సీజన్‌కు గాను దాదాపు 65వేల హెక్టార్ల మేర వేరుశనగ పంటను రైతులు సాగు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకుగాను జిల్లాకు 38,655 క్వింటాళ్ల కాయలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. కే6 రకం కాయలు క్వింటాల్ రూ.9,500, నారాయణి రకం రూ.9,700 ధర నిర్ణయించినట్లు చెప్పారు. అందులో 40 శాతం సబ్సిడీ కింద క్వింటాల్‌కు రూ.3,800 తగ్గిస్తున్నట్లు వివరించారు. దీంతో కే6 రకం క్వింటాల్ రూ.5,700, నారాయణి రకం రూ.5,820 ధర ఉంటుందని తెలిపారు. ఈమేరకు కే6 30 కేజీల బస్తా రాయితీ పోను రూ.1,710, నారాయణి రకం రూ.1,746 రైతులు చెల్లించి కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. ఇప్పటికే ఆయా రైతుభరోసా కేంద్రాల్లో విత్తన కాయలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈ మేరకు విత్తనాలు అవసరమైన రైతులు తమ పేర్లను ఆయా ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలని కోరారు.

గంగ జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: నగరంలోని నడివీధి గంగమ్మ జాతర ఏర్పాట్లను ఎస్పీ మణికంఠ శనివారం పరిశీలించారు. తొలుత అమ్మవారి దీపం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు జాతర నిర్వాహకులు హారతి అందించారు. అనంతరం మండపాన్ని పరిశీలించి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వంశ పారంపర్య ధర్మకర్త కుటుంబీకులు సీకే లావణ్య తదితరులు ఉన్నారు.

అద్వితీయం..పరిణయోత్సవం





తిరుమలలో శ్రీపద్మావతి పరిణయోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు శనివారం శ్రీ మలయప్ప స్వామివారు అశ్వవాహనాన్ని అధిరోహించి వేంచేపు చేయగా, వెంట స్వర్ణ పల్లకీలో శ్రీదేవి, భూదేవి అనుసరించారు. అనంతరం బంగారు తిరుచ్చిలో తిరువీధులగుండా ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేశారు. - తిరుమల

అశ్వ వాహనంపై ఊరేగుతున్న మల్లప్ప స్వామి(ఇన్‌సెట్) ఉద్యానవనంలో ఊయలూగుతూ..

నేత్రపర్వం..జాతర మహోత్సవం



తిరుపతి గ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శనివారం దొర వేషధారణలో భక్తులు సందడి చేశారు. కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు స్థానికులను ఉర్రూతలూగించాయి. - తిరుపతి కల్చరల్



ఆకట్టుకున్న భక్తుల వేషధారణ(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

'అన్న(పులివర్తి నాని) ఫైర్ కూడా ఆన్‌చేశారు.. త్వరగా రండి' అంటూ తన అనుచరుడు అన్న మాటలు ఇప్పుడు జిల్లాలో హాట్ టాఫిక్‌గా మారాయి. గత మంగళవారం తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వద్ద టీడీపీ అల్లరి మూకలు వీరంగం సృష్టించాయి. వైఎస్సార్‌సీపీ నేతల కార్లు, వాహనాలు ధ్వంసం చేశాయి. స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాయి. ఆ వీడియోలు, ఆడియోలు పరిశీలిస్తే పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో మహిళా యూనివర్సిటీ వద్ద నానిపై దాడి జరగలేదని, ఆయనకు అసలు గాయాలు కూడా అవ్వలేదని తేటతెల్లమవుతోంది. కేవలం కారుపైన మాత్రమే దాడి జరిగినట్లు వీడియో బయటపడింది. పులివర్తి నానికి కాలు, చేయి విరిగినట్లు చెబుతున్నవన్నీ అబద్ధాలేనని ఆస్పత్రి వర్గాలు వెల్లడించడం దీనికి మరింత బలాన్ని చేకూర్చుతున్నాయి.

రక్షకుడి రక్తం చిందేలా మహిళా వర్సిటీ వెలుపల పోలీసులపై రాడ్లతో దాడిచేస్తున్న 'పచ్చ'మూక(ఫైల్)



కాల్చింది నాని అన్నే!

- తన అనుచరుడి ఆడియో లీక్
- గన్‌మన్ తుపాకీ లాక్కుని గాల్లోకి ఫైర్ చేసిన చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని
- కార్యకర్తలను రెచ్చగొట్టి.. పోలీసులపైకి ఉసిగొల్పి..
- రోడ్డుపై బైఠాయించొద్దని ప్రాధేయపడిన సీఐ
- సీఐని చుట్టుముట్టి మూకుమ్మడి దాడి
- గొడవచేసి.. కాల్పులు జరిపి.. ఆపై గాయాలైనట్టు నాని నాటకం
- గాయాలేవీ లేకుండానే కట్లు కట్టించుకున్నట్లు చెబుతున్న ఆస్పత్రి వర్గాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: సార్వత్రిక ఎన్నికలు ఈనెల 13న అత్యంత పకడ్బందీగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంని చేసుకునేందుకు ఓటర్లు నిశ్చయించారు. ఇందులో భాగంగానే ఎన్నడూ లేని విధంగా వేకువ జాము నుంచే పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. దీన్ని జీర్ణించుకోలేని కూటమి నేతలు ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు విధ్వంసాలకు తెగబడ్డారు. చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని అనుచరులు రామచంద్రాపురం మండలం, బ్రాహ్మణకాలువ, చంద్రగిరి మండలంలోని కాసిపెంట్ల, రామిరెడ్డిపల్లె పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్‌కు అడ్డుగా ఉన్న ఏజెంట్లు, స్థానిక నాయకులపై దాడిచేశారు. అంతటితో ఆగకుండా బ్రాహ్మణకాలువ దళితవాడ, రామిరెడ్డిపల్లెలో కొట్టాల చంద్రశేఖరరెడ్డి ఇంటిని ధ్వంసం చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వాహనాన్ని తగులబెట్టారు. మరో కారుని ధ్వంసం చేశారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద బీభత్సానికి సూత్రధారులు పచ్చమూకలే

పోలింగ్ పూర్తయిన తరువాత ఈవీఎంలను తిరుపతి మహిళా యూనివర్సిటీ వద్ద భద్రపరిచారు. వీటి భద్రత దృష్ట్యా ఆ ప్రాంతమంతా 144 సెక్షన్ అమలు చేశారు. అయినా స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాల్లో పులివర్తి నాని అనుచరులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అల్లర్లు సృష్టించేందుకు పక్కా ప్లాన్ ప్రకారం రాడ్లు, కర్రలు చేతబట్టుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ స్టిక్కర్‌తో ఉన్న ద్విచక్ర వాహనాన్ని కిందపడేసి ధ్వంసం చేసి నిప్పంటించారు. దీనిపై స్థానికులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీ శ్రేణులను ప్రశ్నించారు. మద్యం మత్తులో ఉన్న పులవర్తి నాని అనుచరులు వారిపై దాడికి దిగారు. అల్లర్లను కంట్రోల్ చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగి పచ్చమూకలను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఇదేదో తప్పెనైట్లు పులవర్తి నాని తన చుట్టూ ఉన్న అనుచరులను పోలీసులపైకి ఉసిగొల్పారు. ఇదే అదునుగా పచ్చమూకలు పోలీసులపైకి దాడికి తెగబడ్డారు. పోలీసులు లాఠీ చార్జ్ చెయ్యడంతో ఇది అన్యాయం అంటూ పులివర్తి నాని, తన అచరులతో రోడ్డుపై బైఠాయించారు. 144 సెక్షన్ అమలులో ఉండగా ఆ ప్రాంతంలో ఎటువంటి ధర్నాలు, ఆందోళనలు చేయకూడదని తిరుపతి రూరల్ సీఐ సమీమ్‌అహ్మద్ నచ్చజెప్పేందుకు వెళ్లగా.. పులవర్తి నాని సైగతో పచ్చమూకలు ఆయనపై తిరగబడ్డారు. సీఐని చుట్టుముట్టి కర్రలు, రాడ్లతో దాడికి పాల్పడ్డారు.

నిక్షేపంగా నాని



మహిళా వర్సిటీ వద్ద ధర్నా చేస్తున్న నానికి గాయాలెక్కడ?

నాటకాల నాని



తీవ్రంగా గాయపడినట్టు ఆస్పత్రిలో చేరిన నాని

'కట్టు' కథల నాని



నాటకం రక్తి కట్టింది.. ఇక కట్లు అవసరం లేదులే..

పులివర్తి నాని హై డ్రామా

టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై అసలు దాడే జరగలేదని, అతనికి గాయాలే అవ్వలేదని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కారులో ఉన్న పులివర్తి నాని వాహనంపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న పులివర్తి నాని కారు దిగి పరుగెత్తుకెళ్లారు. ఇదంతా వీడియోలో రికార్డు అయ్యింది. ఆ తరువాత కాసేపటికి గన్‌మన్ వద్ద ఉన్న తుపాకీ తీసుకున్న పులివర్తి నాని గాల్లోకి కాల్పులు జరిపారు. అయితే గన్‌మన్ ఈ కాల్పులతోనే గాయపడ్డారా? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పులివర్తి నానినే గన్ ఫైర్‌చేశారు.. అన్నదానికి తన అనుచరుడు టీడీపీ నాయకుడికి ఫోన్‌చేసి మాట్లాడుతున్న ఆడియో ఒకటి బయటపడింది. గన్ ఫైర్‌చేసిన అనంతరం పులివర్తి నాని సుమారు 2 గంటల పాటు స్ట్రాంగ్ పరిసరాల్లో కలియదిరిగారు. ఆ తరువాత తనపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దాడిచేశారని, ఆ దాడి కారణంగా స్పృహతప్పి పడిపోయినట్లు నటించారు. ఆపై ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి తాను గాయపడినట్లు సర్టిఫికెట్ ఇవ్వమని డిమాండ్ చేశారు. ఆ వైద్యుడు స్విమ్స్‌కు వెళ్లమని సూచించారు. తన మందీ మార్బలంతో కార్లలో స్విమ్స్‌కు చేరుకున్నారు. అక్కడ వైద్యులను నయానో భయానో బెదిరించి కాలు, చేయి ఫ్రాక్చర్ అయినట్లు కట్టుకట్టించుకుని మరుసటి రోజు వరకు స్విమ్స్‌లోనే చికిత్స పొందుతున్నట్లు తన ఎల్లో మీడియా ద్వారా ప్రచారం చేయించుకున్నారు. పులివర్తి నానికి ఎటువంటి గాయాలు కాలేదని ఆస్పత్రి వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విషయాలను సిట్ వెలుగులోకి తీసుకొచ్చి వాస్తవాలను బయటపెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నాని అరాచకాలు

- ఎన్నిక అనంతరం టీడీపీ అభ్యర్థి నాని కూచువారిపల్లెకు చెందిన చంద్రగిరి ఏఎంసీ చైర్మన్ చంద్రశేఖర్రెడ్డి తల్లిని పక్కకు తోసేసి, ఆ ఇంటిపై పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఇంట్లోని వస్తువులు కాలి బూడిదయ్యే వరకూ నాని, నాని అనుచరులు అక్కడే ఉన్నారు.
- కూచువారిపల్లిలో ఓ బాలుడిని స్వర్ణముఖి నది వద్దకు తీసుకెళ్లి అతనిపై యూరినేషన్ చేసి అమానవీయంగా చితకబాదారు.
- కూచువారిపల్లెలో రామిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డిని రక్షించడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని చుట్టుముట్టారు. ఆయన రెండు కార్లను పెట్రోల్ పోసి తగలబెట్టేశారు.
- మోహిత్‌రెడ్డి అంగరక్షకుడుగా ఉన్న ఈశ్వర్‌రెడ్డిని ఓ ఇంట్లో కట్టేసి కొట్టారు. మోహిత్ రెడ్డితోపాటు ఉన్న వేణురెడ్డిని బలవంతంగా కొటాల గ్రామం వద్దకు తీసుకెళ్లి చెప్పులతో కొట్టారు. వళ్లంతా వాతలు పడేలా చితకబాదారు.
- కూచువారిపల్లి రోడ్డుపై నిలబడి ఉన్న బాలుడు కవలికరెడ్డి మర్మాంగాలపై టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని తన్ని గాయపరిచారు.
- తిరుపతి రూరల్ పరిధిలోని రామానుజంపల్లి పోలింగ్ కేంద్రం సమీపంలో నిలబడి ఉన్న ఉపేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, ప్రదీప్‌రెడ్డిపై దాడికి తెగబడ్డారు.
- తిరుచానూరు ఎంపీటీసీ నరేష్‌రెడ్డిపై పులివర్తి నానీతోపాటు చిత్తూరు నుంచి వచ్చిన రౌడీలు ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా దాడిచేశారు.
- పులివర్తి నానితో వచ్చిన రౌడీలు తిరుపతి రూరల్ మండలం, కుంత్రపాకం గ్రామ మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి కొడుకు అవినాష్‌రెడ్డిని ఒళ్లంతా బ్లేడ్లతో కోశారు.
- పాకాల మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నంగా నరేష్ రెడ్డి కొడుకు లవంత్‌రెడ్డి రెండు చేతుల వేళ్ల రక్తం కారేలా కోసేశారు. బీటెక్ చదువుతున్న ఇతను ప్రస్తుతం పరీక్షలు కూడా రాయలేని పరిస్థితి.
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం పూర్తిచేసుకుని తిరుపతి నుంచి ఇంటికి వెళ్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కారుపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు.
- అగరాల గ్రామంపై మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారు.
- 'తమ ప్రభుత్వం వస్తే మీ అంతు చూస్తాం. రోడ్లపై కూడా తిరగనివ్వం' అంటూ పులివర్తి నాని, అతని అనుచరులు చంద్రగిరి నియోజకవర్గ ప్రజలను నిత్యం ఫోన్లు చేసి భయపెట్టడం రివాజుగా మారుతోంది.
- పులివర్తి నాని భార్య సుధా రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ దాడులకు పిలుపునిచ్చారు.

దీనిపై సిట్ బృందం విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మౌలిక అంశాలే అజెండా



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: మౌలిక అంశాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరించడమే అజెండా అని, ఈ మేరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం ఎన్నికల నిబంధనలకు లోబడి జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరా, వైద్యం, విద్య, వ్యవసాయశాఖలపై సీఈఓ గ్లోరియాతో కలిసి అధికారులతో చర్చించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పతులపై తరుచూ విమర్శలు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు సక్రమంగా వైద్యం అందడంలేదని వార్తలు వెల్లువెత్తుతున్నాయన్నారు. వైద్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలన్నారు. సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. సమస్యలుంటే జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. బడులు ప్రారంభమయ్యే సమయం దగ్గర పడుతున్నందున ఆ మేరకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సచివాలయాల సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 9 ప్రాంతాలకు మాత్రమే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. డీఐఓ రవిరాజు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని వెల్లడించారు. పీహెచ్‌సీల్లో మందులను అందుబాటులో ఉంచామని వివరించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడతూ ఈ నెల 23వ తేదీ నుంచి రైతులకు రాయితీపై వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డీపీఓ లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టామన్నారు. దోమల వ్యాప్తి నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, మహిళా శిశు సంక్షేమ కమిటీ చైర్మన్ భారతి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు ప్రజాప్రతినిధులు

వరసిద్ధుని సేవకు పోటెత్తిన భక్తులు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుమారు 30,123 మంది స్వామివారిని సేవించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు వరసిద్ధుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయానికి శనివారం భక్తులు పొటెత్తారు. రాత్రి వరకు కూడా భక్తులతో ఆలయం కిక్కిరిసింది. విరాళాల ద్వారా రూ.95,971 స్వామివారికి సమర్పించారు. దర్శన టికెట్ల విక్రయంతో రూ.8,86,550 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



భక్తులతో కిక్కిరిసిన క్యూ

ఎన్‌సీసీ శిక్షణతో భవితకు భరోసా

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్‌సీసీ శిక్షణతో భవితకు భరోసా వస్తుందనరి అంధ్రా బెటాలియన్ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ లోకనాథన్ తెలిపారు. శనివారం చిత్తూరులోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో వార్షిక శిక్షణ క్యాంపును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో శిక్షణ పొందే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. శిక్షణలో నేర్చుకునే ప్రతి అంశమూ క్యాడెట్ల ఉన్నతికి దోహద పడుతుందన్నారు. ఎన్‌సీసీ ఏ,బీ,సీ సర్టిఫికెట్‌లతో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం లభిస్తుందని వెల్లడించారు. ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా తల్ సైనిక్, ఐజీసీ ఆర్‌డీసీ క్యాంప్‌ల కోసం క్యాడెట్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. తుపాకీ, డ్రిల్, ఆబ్‌స్టెకిల్, మ్యాప్‌రీడింగ్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, గిరిధర్ నాయక్, రమేష్, కార్తిక్, చంద్ర, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన క్యాడెట్లతో ఎన్‌సీసీ అధికారులు

బాటిల్‌లో పెట్రోల్, డీజిల్ ఇస్తే చర్యలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): బాటిల్‌లో పెట్రోల్, డీజిల్ ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కంటైనర్లు, వాటర్ బాటిళ్లలో ఇంధనం ఇవ్వకూడదని ఈసీ ఆదేశించిందన్నారు. ఈమేరకు జిల్లాలోని పెట్రోల్ బంక్‌లకు నోటీసులు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తియ్యేంత వరకు ఈ ఆదేశాలు కొనసాగుతాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే పెట్రోల్ బంక్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

నైపుణ్యమస్తు.. ఉపాధిప్రాప్తిరస్తు!

యువతకు సకాలంలో ఉపాధి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఐటీఐ కళాశాలల్లో వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు శిక్షణ అందిస్తోంది. త్వరితగతిన ఉద్యోగాలు పొందేలా కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏటా వేలాది మంది యువతీయువకులు జీవితంలో స్థిరపడేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది ఐటీఐలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

- ఐటీఐ అడ్మిషన్లకు నోటిఫికేషన్
- విద్యార్థులకు వృత్తి నైపుణ్యంలో శిక్షణకు కోర్సులు
- విద్యనభ్యసించగానే మెండుగా అవకాశాలు
- స్వల్పకాలిక వ్యవధిలోనే స్థిరపడుతున్న యువత


ప్రభుత్వ ఐటీఐలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షల ఫలితాలు కూడా విడుదలయ్యాయి. అనంతరం కోర్సులపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దృష్టి సారించారు. ఇప్పటికే పాలిసెట్, రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షలు పూర్తయ్యాయి. పలువురు విద్యార్థులు ఏ కోర్సులో చేరాలా అని ఆలోచన చేస్తున్నారు. అధిక శాతం మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరగా, కొందరు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తున్నారు. పదోతరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐ కోర్సులు చక్కని బాటను ఏర్పాటు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఐటీఐ పూర్తి చేసినవారు ఉన్నత విద్యను అభ్యసించేందుకు సైతం అవకాశంగా పొందవచ్చని సూచిస్తున్నారు. సాంకేతిక కోర్సుల్లో ఇంటర్ ఒకేషనల్, పాలిటెక్నిక్ కోర్సులతో పాటు పలువురు విద్యార్థులు ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్)కు అధిక ప్రాధాన్యమిస్తున్నారు.

అందుబాటులో 2,356 సీట్లు

జిల్లా వ్యాప్తంగా 2024–25 విద్యాసంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు 2,356 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ కళాశాలలు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించి పరిశ్రమలకు అందిస్తున్నాయి . యువతకు భరోసానిస్తూ బంగారు భవిష్యత్తుకు బాటలు పరుస్తున్నాయి. ఐటీఐలో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అవసరమైన మెలకువలపై పట్టు సాధిస్తుండడంతో కోర్సు పూర్తవగానే మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

ప్రముఖ కంపెనీల్లో సైతం..

సంప్రదాయ కోర్సులతో పాటు ప్రతి ఐటీఐ లోనూ ఒక్కో కోర్సుకు ప్రాధాన్యమిస్తున్నారు. చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐలో టర్నర్, మెషినిస్ట్, ఫిట్టర్ కోర్సులు చేసిన పలువురు విద్యార్థులు ప్రముఖ సంస్థలు బీహెచ్‌ఈఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్, బీఈఎల్, ఐటీసీఎల్, ఎన్‌టీపీసీ, ఇస్రో తదితర సంస్థల్లో ఉద్యోగాలు పొందారు.

మధ్యలోనే జాబ్ ట్రైనింగ్..

విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆన్‌లైన్ జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ) విధానాన్ని తీసుకొచ్చారు. విద్యార్థులు చదువుతుండగానే మధ్యలో ఓజేటీకి పంపుతున్నారు. విద్యార్థులను హైదరాబాద్, చైన్నె, బెంగళూరు నగరాల్లోని వివిధ సంస్థల్లో మూడు నెలలు, ఆరు నెలల వ్యవధితో సంబంధిత అంశాల్లో నైపుణ్యం పెంపొందిస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు ఆయా సంస్థలు స్టైఫండ్‌గా కొంత మొత్తం చెల్లిస్తుండడం గమనార్హం. అలాగే బాగా పనితీరుకనబరిచే విద్యార్థులు అదే కంపెనీల్లో ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో జిల్లా నుంచి 265 మంది విద్యార్థులు ఓజేటీకి వెళ్లారు.

కోర్సులివే...

ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, టర్నర్, మెషినిస్ట్, మెకానిక్ మోటర్ వెహికల్, (పదో తరగతి విద్యార్హతతో రెండు సంవత్సరాల కోర్సులు), వెల్డర్, మెకానికల్ డీజిల్, కంప్యూటర్ కోర్సు (పదోవతరగతి విద్యార్హతతో ఒక ఏడాది కోర్సులు) ఐటీఐ కళాశాలల్లో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల విద్యార్థులు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ముందస్తుగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో తొలివిడత కౌన్సెలింగ్‌కు అర్హత కల్గిన విద్యార్థులు జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఇతర వివరాలకు 7799933370, 7799679351, 9493629036 నంబర్లలో సంప్రదించవచ్చు.

చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల



జిల్లా సమాచారం

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు :	07
ప్రైవేట్ ఐటీఐ కళాశాలలు :	09
2022-23లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు :	2,372
2023-24లో ప్రవేశం పొందినవారు :	2,356
2024-25లో అందుబాటులోని సీట్లు :	2,356

కోర్సు పూర్తయితే ఉద్యోగం సులువే..

ఐటీఐ ఉత్తీర్ణులైన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందొచ్చు. విద్యుత్, రైల్వే, రక్షణ తదితర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు త్వరితగతిన లభిస్తున్నాయి. ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహం లేదు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఐటీఐ కోర్సు దోహదపడుతుంది.

ఉన్నత చదువులకు అవకాశం

ఐటీఐ కోర్సుల్లో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందవచ్చు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు అనంతరం బీటెక్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు.

ఎలక్ట్రానిక్ మెకానిక్ కోర్సు చేస్తున్నా



నేను చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రానిక్ మెకానిక్ కోర్సు రెండో సంవత్సరం చదువుతున్నా. ఇక్కడి అధ్యాపకులు చక్కగా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. కళాశాలలో మంచి సౌకర్యాలున్నాయి. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఐటీఐ చదువుకుంటున్నాను. నైపుణ్యాలు పెంచుకుని మంచి ఉద్యోగంలో స్థిరపడతా.

– వేణుగోపాల్, విద్యార్థి, యాదమరి మండలం

డిగ్రీ పూర్తి చేసి ఐటీఐలో చేరా



డిగ్రీ కోర్సు పూర్తి చేశా. టెక్నికల్ వైపు వెళ్లాలనే ఉద్దేశంతో తిరిగి ఐటీఐ కోర్సులో చేరా. ప్రస్తుతం చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సు ఫస్టియర్ చదువుతున్నా. ఇది పూర్తికాగానే నేను అనుకున్న రంగంలో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తా. వర్చువల్ పద్ధతిలో శిక్షణ బాగా ఇస్తున్నారు. సౌకర్యాలు చక్కగా ఉన్నాయి.

– ఐశ్వర్య, విద్యార్థిని, చిత్తూరు

గతంలో ఎన్నడూ లేని వసతులు



గతంలో ఎన్నడూ లేని వసతులు ఇప్పుడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఉన్నాయి. చిత్తూరులోని ఐటీఐ కళాశాలల్లో రూ.10 లక్షలతో వర్చువల్ క్లాస్‌రూం, ఏఆర్, వీఆర్ ల్యాబ్‌ను రూ.29 లక్షలతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్షలు సీబీటీ విధానంలో జరుగుతాయి. ఏటా వేల మంది విద్యార్థులు ఐటీఐ పూర్తి చేసి మంచి నైపుణ్యాలతో ఉన్నత ఉద్యోగాల్లో చేరుతున్నారు.

– రవీంద్రరెడ్డి, ప్రభుత్వ,ప్రైవేట్ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్

స్కూల్ బస్.. 'ఫిట్‌నెస్'

- జిల్లా రవాణాశాఖ కార్యాలయం వద్ద బడి బస్సుల తనిఖీ
- కండిషన్‌లో లేకుంటే అనుమతి నిరాకరణ
- టెస్ట్‌లో నెగ్గితేనే సర్వీస్‌కు పర్మిషన్


బస్సు కండిషన్ పరిశీలిస్తున్న అధికారులు

కాణిపాకం: జిల్లాలోని పాఠశాలలను త్వరలోనే పునఃప్రారంభంకానున్నాయి. ఈ మేరకు బడి బస్సులు రోడెక్కనున్నాయి. ఈక్రమంలో విద్యార్థులు ప్రతి రోజూ ప్రయాణించే స్కూల్, కళాశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలకు రవాణా శాఖ చర్యలు చేపట్టింది. పరీక్షల్లో తప్పనిసరిగా బస్సులు కండిషన్‌లో ఉన్నట్లు రుజువు కావాలని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో 852 బస్సులు

జిల్లాలో బడి బస్సులు 852 వరకు ఉన్నాయి. వీటిలో ప్రతిరోజు 20 నుంచి 30 బస్సుల కండిషన్‌ను అధికారులు పరీక్షిస్తున్నారు. వాహనంలో లోటుపాట్లు కనిపిస్తే వెంటనే వెనక్కి పంపిస్తున్నారు. ఆ లోపాలను సరిదిద్దేంత వరకుకు సర్టిఫికెట్ జారీ చేయడంలేదు.

పరీక్షలు ఇలా..

- స్కూల్ బస్సును మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వయంగా డ్రైవ్ చేస్తారు.
- మరమ్మతులు ఏమైనా ఉన్నాయి గుర్తిస్తారు.
- బ్రేకులు, క్లచ్, స్టీరింగ్, హ్యాండ్ బ్రేక్, బ్యాటరీ, ఇంజన్‌కు సంబంధించి పలు విభాగాలను పరిశీలిస్తారు.
- అత్యవసర ద్వారాలు, కిటికీలు, టైర్లు, సీట్లను పరిశీలించి సంతృప్తి చెందిన తర్వాతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

నిబంధనలు ఇలా..

- డ్రైవర్‌కు 60 ఏళ్లలోపు వయసు ఉండాలి. ఐదేళ్ల అనుభవంతో కూడిన భారీ వాహన లైసెన్సు తప్పనిసరి
- శారీరక దారుఢ్యంతోపాటు ఆరోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.
- డ్రైవర్, సహాయకుడు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలి. వేగంగా, నిర్లక్ష్యంగా బస్సు నడపకూడదు
- బస్సులో ప్రథమ చికిత్స బాక్సు ఉండాలి
- విద్యార్థులు ఎక్కేందుకు, దిగేందుకు ఆధారంగా బస్సుకు రెండు వైపులా ఇనుప కడ్డీలు ఉండాలి. వాహనం ముందు భాగంలో పాఠశాల పేరు, చిరునామా, ఫోన్ నంబర్లు తప్పనిసరి.

కండిషన్ లేకుంటే చర్యలు



స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం. అన్నీ సక్రమంగా ఉంటేనే ధ్రువీకరణ పత్రం జారీ చేస్తాం. ఫిట్‌నెస్ లేకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ బస్సును రోడ్డుపై తిరగనివ్వం. ఫిట్‌నెస్ పరీక్ష చేయించకుండా బస్సు నడిపితే కేసులు నమోదు చేస్తాం. లైసెన్స్ ఉన్న డ్రైవర్‌తోనే బండి నడిపించాలి.

– నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

టిప్పర్ బోల్తా : డ్రైవర్ మృతి


రాజేష్ మృతదేహం

బంగారుపాళెం: మండలంలోని జయంతి ఎస్టీ కాలనీ వద్ద శనివారం సాయంత్రం టిప్పర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. కాలనీ సమీపంలో ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ పనుల కోసం టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎగువబందార్లపల్లెకు చెందిన రాజేష్(34) తన టిప్పర్‌లో మట్టి అన్‌లోడ్ చేస్తుండగా హైడ్రాలిక్ రాడ్ విరిగి బోల్తాపడింది. దీంతో వాహనంలో ఇరుక్కుపోయి రాజేష్ అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. టిప్పర్ నుంచి డ్రైవర్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కాణిపాకంలో విశేష సేవలు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం విశేష సేవలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 4.30 నుంచి 5 గంటల వరకు సుప్రభాతసేవ, 6 నుంచి 6.30 గంటల వరకు గణపతి సహస్రనామార్చన, ఉదయం 5 గంటలకు, 9 గంటలకు, 11 గంటలకు ప్రత్యేక అభిషేకం, ఉదయం 7.30, సాయంత్రం 5.30 గంటలకు పాలాభిషేకం జరిపించనున్నట్లు వివరించారు.

విద్యుత్ చౌర్యంపై కేసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని మొత్తం 3,529 విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. తిరుపతి ఆపరేషన్ 99, తిరుపతి రూరల్ 50, పుత్తూరు 94, చిత్తూరు అర్బన్ 79, చిత్తూరు రూరల్ 59, మదనపల్లె 74, పీలేరు 41, పుంగనూరు పరిధిలో 63 కేసులు బుక్ చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 483 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుము రూ.13.43 లక్షలు, చౌర్యం కేసులు 76కు గాను రూ.59 వేలు జరిమానాతో కలిపి మొత్తం 559 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.14.02 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్‌ఈ కృష్ణారెడ్డి వివరించారు.

గంగమ్మ ఆలయంలో చోరీ

వలమనేరు : మండలంలోని మొరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి గిన్నెబొట్టు, హుండీలోని నగదును అపహరించారు. శనివారం ఈ విషయాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల క్రితం నిర్మించిన ఈ ఆలయంలో 40 రోజులుగా ప్రత్యేక పూజలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమ్మవారి బంగారు ముక్కుపుడకపై కన్నేసిన దుండగులు చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. దుండగులు మొత్తం రూ.30వేల సొత్తు చోరీ చేసినట్లు గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు : పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన బావాజాన్(38) శనివారం విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. బావాజాన్, అతడి భార్య కూలిపనులు చేసుకుంటూ పొట్టపోసుకునేవారు. ఈ క్రమంలో మద్యానికి బానిసగా మారిన బావాజాన్ తన భార్య పనిచేసే చోటుకు వెళ్లి గొడవ పడ్డాడు. దీనిపై భార్య మందలించడంతో మనస్తాపం చెందిన ఇంటికి వచ్చి పురుగుమందు తాగేశాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, ప్రస్తుతం చికిత్సపొందుతున్నాడు.



